

## సుజలాం.. సుఫలాం

టెక్కలిలో వందేళ్లు నిండిన మునసబ్బఖానా ఉంది. ఇప్పటికీ నీరందిస్తోంది.

-10లో




## రోడ్డు ప్రమాదంలో..

రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మృతుడు ఒడిశావాసి.

-10లో

## కారు-బైక్ ఢీ

కాశీబుగ్గ: పలాస మండలం లొద్దబద్రలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఒడిశాకు చెందిన కారు.. ఆంధ్రాకు చెందిన ద్విచక్ర వాహనం పరస్పరం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న మహిళకు కాలు విరగ్గా, అదే బండి నడుపుతున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108 అంబులెన్సులో పలాస ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## న్యూస్‌రీల్

### లక్ష్మీపురం డీలర్‌పై కూటమి నాయకుల దాడి



డీలర్ చేతిపై, ఆమె కుమార్తె కంటి వద్ద గాయాలు

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో డీలర్‌గా పనిచేసిన డి.రమణమ్మపై ఆ గ్రామానికి చెందిన కూటమి నాయకులు గురువారం దాడికి పాల్పడ్డారు. గాయాలపాలైన ఆమెను 108 ద్వారా రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలో డీలర్‌గా పనిచేసిన డి.రమణమ్మను రేషన్ పంపిణీలో కందిపప్పు వద్ద అవకతవకలు జరిగాయనే ఆరోపణలతో గత ఏడాది ఏప్రిల్‌లో సస్పెండ్ చేశారు. అయితే ఆమె హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు ఆమె డీలర్‌గా కొనసాగేందుకు స్టే ఇచ్చింది. అయితే రమణమ్మ డీలర్‌గా కొనసాగడానికి వీల్లేదని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకురాగా.. ఆ మేరకు గురువారం ఎమ్మార్వో జోగారావు, ఆర్ఐ శ్రీనివాసరావులు గ్రామానికి చేరుకుని గ్రామస్తుల వద్ద స్టేట్‌మెంట్ తీసుకున్నారు. కోర్టు ఆర్డర్ ఇచ్చిందని, దీన్ని తాము కాదనలేమని ఆమెనే కొనసాగించాలని అధికారులు తెలిపారు. ఏ స్టే ఇచ్చినా తమకు ఆమె డీలర్‌గా కొనసాగేందుకు ఇష్టం లేదని స్థానికులు అధికారులకు తెలిపారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. ఆ తర్వాత వీఆర్‌ఓ గ్రామస్తుల వద్ద స్టేట్‌మెంట్ తీసుకుంటుండగా అక్కడకు వచ్చిన డీలర్ రమణమ్మను చూసిన కూటమి నాయకులు ఒక్కసారిగా ఆమెపై దాడికి దిగారు. ఆమె వద్దనున్న ఫోన్ లాక్కున్నారు. ఆమెతో పాటు రమణమ్మ భర్త సూరప్పన్న, కుమార్తె వసంత కుమారిలపై కూడా దాడిచేశారు. వీరంతా ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. కూటమి నాయకులు డీలర్‌పై చేసిన దాడిని ఖండిస్తున్నామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దన్నాన రాజీన్నాయుడు, రొక్కం బాలకృష్ణలతో పాటు పలువురు తెలిపారు.

### సెంటీమీటర్ శిలువ



కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 21వ వార్డుకు చెందిన సూక్ష్మ కళాకారులు కొత్తపల్లి రమేష్ ఆచారి పలుచటి బంగారపు రేకు పైన శిలువ గుర్తు తయారు చేశారు. కేవలం 100 మిల్లీ గ్రాముల బంగారంతో ఒక సెంటీమీటర్ ఎత్తుతో తయారు చేసి గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

### 'ప్రభుత్వ పాఠశాలలను 10 లక్షల మంది విడిచారు'



ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కరపత్రం విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కాశీబుగ్గ: కరోనా సమయంలో నాలుగు లక్షల మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరితే.. ఇప్పుడు ప్రభుత్వ విధానాల వల్ల 10 లక్షల మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలలను విడిచిపెట్టి వెళ్లిపోయారని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు అన్నారు. కాశీబుగ్గ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా కార్యదర్శి కంచరాన రమేష్ ఆధ్వర్యంలో గురువారం ప్రాంతీయ సమావేశం జరిగింది. సమావేశంలో పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగంపై చేస్తున్న ప్రయోగాల వల్ల నానాటికీ విద్యావ్యవస్థ దిగజారే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఒకే మీడియం పాఠశాలలను నిర్వహించడం, 3,4,5 తరగతులు హైస్కూల్‌లో కలపడం, నేటి ప్రభుత్వం పరిసర ప్రాంత పాఠశాలల విలీనం చేయడం పాఠశాలల మూత వేయడానికి ప్రధాన కారణమన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తి, జిల్లా కార్యదర్శి గున్న రమేష్, అకడమిక్ సెల్ కన్వీనర్ లఖినాన వెంకటాచలం, పలాస అధ్యక్షుడు తమ్మినాన జయరాం, ప్రధాన కార్యదర్శి డి.జనార్దనరావు, పి.సంజయ్‌కుమార్, టి.అప్పారావు, పలాస వజ్రపుకొత్తూరు మందస యూటీఎఫ్ నాయకులు హాజరయ్యారు.

---

గారలోని వంశధార నదిలో విధ్వంసం



# నదిలో ఇసుక తోడేళ్లు

## వంశధారకు గర్భశోకం

- చినబాబు పేరు చెప్పి విధ్వంసం
- ఎన్జీటీ ఆదేశాలకు తిలోదకాలు
- పగలు, రాత్రి తేడా లేకుండా నదిలో ఇసుక తోడేస్తున్న వైనం
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- ఉప్పునీటిమయం అవుతున్న మంచినీటి వనరులు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

గారలోని వంశధార నదిలో విధ్వంస రచన జరుగుతోంది. ఇంత విధ్వంసం జరుగుతున్నా అధికారులు కిమ్మనడంలేదు. 15నుంచి 20 మీటర్ల లోతులో నదుల్లో ఇసుక తోడేస్తున్నారు. పట్ట పగలు యంత్రాలు పెట్టి మరీ ఇసుక తీసుకెళ్లిపోతుంటే.. అధికారులు చోద్యం చూడడం విస్మయం కలిగిస్తోంది.

**చినబాబు పేరు చెప్పి**

'చినబాబు' పేరు చెప్పి కొందరు వంశధారను కొల్లగొడుతున్నారు. రాత్రింబవళ్లు ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. నదీమ తల్లికి గర్భశోకాన్ని మిగిలిస్తున్నారు. భూగర్భ గనుల శాఖ, రెవెన్యూ, పోలీసులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. పట్టపగలే ఇసుకను దోచేస్తున్నారు. వందల టిప్పర్లతో తరలించేస్తున్నారు. దీంతో జల వనరులు ధ్వంసమవుతున్నాయి. నదీ గర్భంలో ఇసుకను తోడేస్తుండటంతో అవి రూపం కోల్పోతున్నాయి. జీవ నది కాస్త వాగులా మారిపోతోంది. 15నుంచి 20అడుగుల లోతులో తవ్వకాలు జరపడంతో ఎక్కడా నీటి నిల్వ లేకపోవడంతో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్నాయి. 40 మీటర్ల వరకు అడుగంటిపోతున్నాయి.

**పట్టించుకోని అధికారులు**

అడ్డు అదుపూ లేని ఇసుక తవ్వకాలు అటు పర్యావరణం, ఇటు జనజీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. నదీ గర్భంతో పాటు తీరాల్లోనూ ఇసుకను విచ్చలవిడిగా తవ్వేయడంతో చినుకు నేలలోకి ఇంకే పరిస్థితి ఉండటం లేదు. ఫలితంగా భూగర్భ జలాలు మరింత కిందకు జారిపోతున్నాయి. జలసిరితో కళకళలాడాల్సిన భూగర్భం తడారి ఎడారిగా మారుతోంది. నదీ గర్భంలో సైతం నీటి జాడ కరువవుతోంది. లోతైన గోతులు, కనుమరుగవుతున్న ఇసుకతో నదీ గమనం మారిపోతోంది. నదికి రక్షణగా నిలవాల్సిన కరకట్టలు బలహీనమైపోతున్నాయి. కళ్లెదుటే తవ్వకాలు జరుగుతున్నా.. ఇసుక లారీలు తిరుగుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.

**ఎన్జీటీ ఆదేశాలున్నా..**

గారలోని వంశధార నదిలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలపై ఇప్పటికే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. తక్షణమే తవ్వకాలను ఆపాలని ఆదేశించింది. కానీ ఇక్కడ అధికారులు ఆ ఆదేశాలను అమలు చేయడం లేదు. అక్రమ తవ్వకాలకు వంత పాడుతున్నారు. చినబాబో... పెదబాబో పేరు చెప్పి అక్రమార్కులు విధ్వంసం సృష్టిస్తున్నారు. తమ జేబులు నింపుకోవడానికి వంశధారను ఛిద్రం చేస్తున్నారు. ఏదో ఒక నెపంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇసుకను తోడేస్తున్నారు. దర్జాగా వందల టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అటు మైనింగ్, ఇటు రెవెన్యూ, పోలీసు అధికారులు తమకేమీ పట్టదన్నట్టు వ్యవహరిస్తున్నారు. అక్రమ తవ్వకాలపై స్థానికులు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదు.



గారలోని వంశధార నదిలో యంత్రాలతో ఇసుక తవ్వుతున్న దృశ్యం

### వాల్టా చట్టం ఏం చెబుతోంది..?



భూగర్భ జలాలు ప్రమాదకర(ఓవర్ ఎక్స్‌ప్లాయిటెడ్) స్థితికి చేరుకుంటే ఆ ప్రాంతాల పరిధిలో ఇసుక తవ్వకాలపై నిషేధం విధించాలి. నోటిఫైడ్ ప్రాంతాల్లో కేవలం స్థానిక గ్రామ, పట్టణ అవసరాలకు మాత్రమే తవ్వకాలు జరపాలి. డ్యాములు, బ్రిడ్జిలు, నీటి పంపులు, మంచినీటి బావులకు 500మీటర్ల పరిధిలో తవ్వకాలకు అనుమతి ఇవ్వకూడదు. తీరంలో 8 మీటర్లు ఆపై లోతులో ఇసుక లభ్యత ఉంటే గరిష్ఠంగా 2 మీటర్ల లోతు వరకు తవ్వకాలకు అనుమతి ఇవ్వాలి. నది గర్భం నుంచి తీరం వరకు 15 మీటర్ల వరకు ఇసుక తవ్వకాలపై నిషేధం విధించాలి.

### 22న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అరసవల్లి: జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఈ నెల 22న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎల్.ఎన్.వి.శ్రీధర్ రాజా పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 22వ తేదీ మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు స్థాయీ సంఘాల సమావేశం ప్రారంభం అవుతాయన్నారు. ఉదయం 10.30కు 2, 4, 1, 7 స్థాయీ, మధ్యాహ్నం 3 గంటలకు 6వ స్థాయీ, 4 గంటల 3వ స్థాయీ, సాయంత్రం 5 గంటలకు 5వ స్థాయీ సంఘాల సమావేశాలు జరగనున్నట్లు ఆ ప్రకటనలో వివరించారు.

### 10.5 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

ఇచ్ఛాపురం టౌన్: ఒడిశా నుంచి తమిళనాడుకు 10.5కిలోల గంజాయిని తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన నరేష్ సేతి, డి.గోపీనాథ్ అనే ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ చిన్నమనాయుడు తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలో నివాసం ఉంటూ గంజాయి వ్యాపారం చేసే లారెన్స్ ప్రధాన్ అనే వ్యక్తి డబ్బులు ఇవ్వడంతో వీరు ఇక్కడి నుంచి గంజాయి తీసుకెళ్తున్నట్లు తెలిసిందన్నారు. ఒడిశాలో గంజాయి కొని ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కు వెళ్తుండగా పట్టణ పోలీసుల తనిఖీల్లో దొరికారని పేర్కొన్నారు. తనిఖీల్లో పట్టణ ఎస్ఐ ఎం.ముకుందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

---

## ఆ పాపం కింజరాపు కుటుంబానిదే..




మాట్లాడుతున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో నాలుగు దశాబ్దాల కాలంగా కింజరాపు కుటుంబీకుల పాలన సాగుతోందని, జిల్లాను తలసరి ఆదాయంలో చివరి స్థానంలో ఉంచిన ఘనత వారిదేనని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ధ్వజమెత్తారు. ఆయన గురువారం శ్రీకాకుళంలో మీడియాతో మాట్లాడారు. జిల్లాలో పెద్దరికం చేసి జిల్లాకి వారు చేసింది సున్నా అని గమనించాలన్నారు. జిల్లాలో మూలపేట పోర్టు వైఎస్సార్‌సీపీ గ్రౌండ్ చేసిందని, అంతేకాకుండా ఫిష్ ల్యాండింగ్‌సెంటర్లు, పోర్టులు కూడా తమ ప్రభుత్వ హయాంలోనే మొదలుపెట్టామని గుర్తు చేశారు. గ్రామాలకు బస్సులు వేయలేనివారు జిల్లాలో ఎయిర్ పోర్టులు నిర్మిస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో చేసిన పనులకే మళ్లీ మళ్లీ శంకుస్థాపనలు చేసి కూటమి నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. కనీస అవసరాలు తీర్చకుండా అవసరం లేని ఆర్భాటాలు చేస్తున్నారని తెలిపారు. 30 ఏళ్ల పాటు పాలించినా ఒక్క ప్రాజెక్టు తీసుకురాలేకపోయారని తెలిపారు. ఎక్కడ ఏ అభివృద్ధి పనులు చేస్తామన్నా ప్రజలు, ప్రజాసంఘాలు, కమ్యూనిస్టులు అడ్డుతగులుతున్నారని వారు చెప్పడం సిగ్గుచేటన్నారు.

## పార్టీ పటిష్టతకు కృషిచేద్దాం

- మాజీ స్పీకర్, పార్టీ పీఏసీ మెంబర్ తమ్మినేని సీతారాం



తమ్మినేని సీతారాంను కలిసి సత్కరించిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ సత్యనారాయణ తదితరులు

ఆమదాలవలస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కలిసికట్టుగా కృషి చేద్దామని మాజీ స్పీకర్, వైఎస్సార్ సీపీ జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త, పార్టీ పీఏసీ మెంబర్ తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. ఆయనను పీఏసీ మెంబర్‌గా పార్టీ అధిష్టానం, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించిన సందర్భంగా.. ఆమదాలవలస పార్టీ కార్యాలయంలో గురువారం తమ్మినేనికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర కాళింగ కుల అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావుతో పాటు సరుబుజ్జిలి, పొందూరు మండల నాయకులు సత్కరించారు. పార్టీ బలోపేతానికి అందరం కలిసి పనిచేయాలని తమ్మినేని వారికి సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే తాను జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో సరుబుజ్జిలి మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, సరుబుజ్జిలి, పొందూరు మండలాల పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే పీఏపై ఫిర్యాదు




పోలీసులు ఇచ్చిన రశీదు

నరసన్నపేట: ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రైవేటు పీఏ రావాడ గణపతిపై కరగాంకు చెందిన టీడీపీ కార్యకర్త యాళ్ల మల్లేశ్వరరావు నరసన్నపేట పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఇటీవల వీరిద్దరి మధ్య ఫోన్‌లో వాగ్వాదాలు జరగడం, ఈ ఫోన్ ఆడియో వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ కావడం, పేపర్లలో ప్రచురితం అయిన విషయం విదితమే. ఆడియోలో మల్లేశ్వరరావుకు గణపతి నరసన్నపేట వస్తే నీ అంతు చూస్తానని బెదిరించడంతో ఆయన పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ దుర్గాప్రసాద్ వద్ద ప్రస్తావించగా ఫిర్యాదు వచ్చిందని అన్నారు.

---

నాడు-నేడు | అమ్మ ఒడి | విద్యాదీవెన | వసతి దీవెన..

**పేదల ఇంటిలో దీపాలు వెలిగించిన పథకాలివి. సరస్వతీ కటాక్షం ఉన్నా.. లక్ష్మీ కటాక్షం లేక మరుగున పడిపోతున్న నిరుపేద విద్యార్థులకు అండగా నిలిచిన కార్యక్రమాలివి. ప్రభుత్వ బడులపై ఉన్న చిన్నచూపును నాడు-నేడు సమూలంగా పోగొడితే, డబ్బుల్లేక చదువులు ఆగిపోయే పరిస్థితిని అమ్మ ఒడి రూపు మాపింది. ఖర్చులకు భయపడి పెద్ద చదువులకు దూరమవుతున్న వారికి విద్యా దీవెన, వసతి దీవెన వరాల్లా మారాయి. ఆ ఫలితాలే ఇప్పుడు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. వైఎస్ జగన్ హయాంలో జరిగిన గొప్ప మార్పులకు ఈ విజయాలే తార్కాణాలు.**




వైఎస్ జగన్ హయాంలో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటైన ఐఎఫ్‌పీ ప్యానెల్

# నాటి మార్పులే.. నేటి మార్కులు

- ఇంటర్ ఫలితాల్లో అదరహో అనిపించిన ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు
- వైఎస్ జగన్ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెరుగైన వసతులు, సౌకర్యాల కల్పన
- రూపాయి ఖర్చు లేకుండా ఇంగ్లిష్ మీడియంలో బోధన

శ్రీకాకుళం న్యూకాలనీ/బూర్జ/ ఆమదాలవలస:

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుచూపు ప్రభుత్వ విద్యార్థుల పాలిట వరంగా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వారంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉన్నతమైన విద్యాభ్యాసాన్ని, విలువలను అందిపుచ్చుకున్నారు. అమ్మఒడితో ఆర్థిక భరోసాను, విద్యాకానుకతో చదువుకు అవసరమైన సామగ్రిని అందుపుచ్చుకుని, రూపా యి ఖర్చు లేకుండా అన్ని వసతులు, సౌకర్యాలతో ఇంగ్లిష్ మీడియంతో పదో తరగతి చదువులను పూర్తిచేశారు. పదో తరగతిలోను మెరిసిన ఆ బిడ్డలు.. తాజాగా ఇంటర్మీడియెట్‌లోను సత్తాచాటారు.

**ఆగమేఘాల మీద సత్కారాలు..**

గత ప్రభుత్వం చేసిన సత్కారాలకు పూర్తి భిన్నంగా కూటమి ప్రభుత్వం ఆగమేఘాల మీద సత్కార కార్యక్రమాలను నిర్వహించింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో జగనన్న ఆణిముత్యాల పేరిట వివిధ మేనేజ్‌మెంట్లవారీగా నాలుగు స్థాయిల్లో అంటే పాఠశాల/కళాశాలస్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో అవార్డులు, సత్కారాలు, నగదు ప్రోత్సాహకాలను ఏర్పాటు చేసి రెండు వారాలపాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేవారు. ఈ విషయం విద్యార్థులందరికీ బాగా తెలుసు. రాష్ట్రస్థాయి వేడుకల్లో స్వయంగా నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా రూ.లక్ష చొప్పున రివార్డు అందజేసేవారు. విద్యార్థులతోపాటు వారి ప్రిన్సిపాళ్లు, తల్లిదండ్రులను సైతం సత్కరించేవారు. కానీ ప్రస్తుతం ఒక్క విద్యార్థులకు మాత్రమే షైన్ అవార్డుల పేరిట సత్కారాలు చేసేలా ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించింది.



నాడు-నేడు నిధులతో సుందరంగా రూపుదిద్దుకున్న ఓ పాఠశాల

### జిల్లా నుంచి ముగ్గురు



దామోదర స్వప్న



కర్ని ధరణి

సిక్కోలు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అదరహో అనిపించి స్టేట్ అవార్డులకు ఎంపిక య్యారు. ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న దామోదర స్వప్న ఎంపీహెచ్‌డబ్ల్యూ ఒకేషనల్ కోర్సులో 1000 మార్కులకు 989 మార్కులతో రాష్ట్రంలో టాపర్‌గా నిలిచింది. అలాగే బూర్జ మండలం ఓపీ పేట ఏపీమోడల్ స్కూల్/కాలేజ్‌లో చదువుతున్న కర్ని ధరణి ఎంపీసీ జనరల్ కోర్సులో 1000 మార్కులకు 984 మార్కులు సాధించి శభాష్ అనిపించింది. శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో చదువుతున్న అండ్లూరి సేవేంద్రకుమార్ సీజీఏ ఒకేషనల్ కోర్సులో 1000 మార్కులకు 958 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. వీరు ముగ్గురు మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సత్కారాలు అందుకున్నారు.

### ఒప్పంగిలోనే బలమైన పునాది



మాది శ్రీకాకుళం రూరల్ వప్పంగి గ్రామం. అండ్లూరి అప్పలరాజు, భవాని మా పేరెంట్స్. నాన్న గ్రామంలోనే ఇత్తడి సామాన్ల బిజినెస్ చేస్తారు. అమ్మ హౌస్‌వైఫ్. నేను పదో తరగతి వరకు ఒప్పంగి జెడ్పీహెచ్‌స్కూల్‌లో చదువుకున్నాను. సబ్జెక్టులపై అక్కడ బలమైన పునాది పడింది. టెన్త్‌క్లాస్‌లో 514 మార్కులు వచ్చాయి. గత ప్రభుత్వంలో నాడు-నేడుతో మా పాఠశాల అభివృద్ధి జరిగింది. మంచి అనుభవజ్ఞులైన మాస్టార్లు వచ్చారు. మూడేళ్లపాటు జగనన్న విద్యాకానుక ద్వారా రూపాయి ఖర్చు లేకుండా నా చదువు సాఫీగా సాగిపోయింది. ఇంటర్‌లో స్టేట్‌లో సీజీఏ గ్రూపులో టాప్ మార్కులు నాకే వచ్చాయి. చాలా సంతోషంగా ఉంది. బీటెక్‌లో సీఎస్ఈ చదివి, సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడాలనేది నా కోరిక.

– అండ్లూరి సేవేంద్రకుమార్, సీజీఏ-ఒకేషనల్ కోర్సు విద్యార్థి, 958 మార్కులు



బడిలో సదుపాయాలు

---

# జీడిపప్పు అధరహో..!



- పెరిగిన జీడిపప్పు ధరలు
- పరిశ్రమల్లో పిక్కల కొరతే కారణం
- కేజీ జీడిగుడ్లు రూ.830, జీడిబద్దలు రూ.760కు పైమాటే

కాశీబుగ్గ: ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతిగాంచిన పలాస జీడిపప్పు ధరకు రెక్కలొచ్చాయి. కొత్త జీడి పంట చేతికి అందుతున్న తరుణంలో పాత జీడినిల్వలు పూర్తవడంతో ఒక్కసారిగా జీడిపప్పుకు డిమాండ్ ఏర్పడింది. రెండు నెలలుగా వరుసగా శుభకార్యాలు ఊపందుకోవడం, నెలరోజులుగా పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలలోని జీడి పరిశ్రమలలో అటు పిక్కలు, ఇటు పప్పు రెండూ అందుబాటులోకి రాకపోవడంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి. అనేక ప్రాంతాలలో జీడిపప్పు దొరుకుతున్నప్పటికీ ఉద్దానం ఇసుక నేలలో పండిన జీడి పంట రుచే వేరు. అందుకే ధర ఎంత పెరిగినా డిమాండ్ మాత్రం తగ్గదు.

**అనధికారికంగా మూత..**

మరోవైపు, కొంతమంది పరిశ్రమదారులు గోదాములలో పాత పిక్కలు, పప్పులను షాపులకు తరలించి ఫ్యాక్టరీలు ఖాళీ చేస్తున్నారు. పిక్కలు లేవంటూ అనధికారకంగా పరిశ్రమలను మూసివేస్తున్నారు. కొత్త పప్పు ప్రాసెసింగ్ జరగడం లేదంటూ కృత్రిమ కొరత ఏర్పడేలా చేసి ధరలను పెంచుతున్నారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. ఏదిఏమైనా పలాస కాష్యూ మాన్యుఫ్యాక్చర్ అసోషియేషన్ పరిధిలోని మూడు వందలకు పైగా పరిశ్రమలతో పాటు ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లోని పరిశ్రమలు సైతం ధరలు భారీగా పెంచేశాయి. టన్నుల కొద్దీ లారీలు ఉత్తరాదికి ఎగుమతులు జరుగుతున్నా స్థానికంగా పప్పు దొరకాలంటే కష్టతరంగా మారింది.

**కొత్త ధరలు**

| రకం | ధర |
|---|---|
| జంబో జీడి పప్పు | రూ.900 |
| మొదటి రకం(240 గుడ్లు) | రూ.830 |
| మూడో రకం (330 గుడ్లు) | రూ.760 |
| నాలుగోరకం (కౌంట్‌లెస్) | రూ.730 |
| మొదటి రకం బద్ద (జేహెచ్) | రూ.760 |
| రెండో రకం బద్ద (జేహెచ్) | రూ.600-రూ.700 |
| మూడో రకం(కే) సగం బద్ద | రూ.710 |
| నాలుగో రకం ముక్క బద్ద | రూ.610 |
| మొదటి రకం బేబీ (జీడి నూక) | రూ.440 |
| రెండో రకం బేబీ (జీడి నూక) | రూ.250 |

## క్లుప్తంగా

### పోగొట్టుకున్న సొమ్ము అప్పగింత



బాధితుడికి నగదు అందజేస్తున్న హెచ్‌సీ

**సారవకోట:** మండ కేంద్రం సారవకోటలోని గ్రామీణ బ్యాంకు ఆవరణలో గత ఏడాది డిసెంబర్‌లో బొంతు గ్రామానికి చెందిన తంగుడు సురేష్ నగదు పోగొట్టుకున్నాడు. పోగొట్టుకున్న నగదులో లక్ష రూపాయలను గురువారం స్థానిక పోలీసులు బాధితుడికి అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. బొంతు గ్రామానికి చెందిన సురేష్ గ్రామీణ బ్యాంకులో రూ 1.30 లక్షలు నగదు జమ చేసేందుకు వచ్చి సొమ్మును బ్యాంకు కుర్చీపై పెట్టాడు. గుర్తు తెలియని వ్యక్తి నగదును బ్యాగ్ దొంగిలించుకుని పారిపోయాడు. ఇటీవల మందస పోలీసులు వేరే కేసులో పలువురు నిందితులను పట్టుకోగా అందులో సురేష్ నగదు దొంగిలించిన వ్యక్తి ఉండటంతో సొమ్ము రికవరీ చేశారు. రూ.లక్షను బాధితుడికి హెచ్‌సీ శ్రీనివాసరావు అందజేశారు.

### బిత్తరబందలో దొంగల హల్‌చల్



గాయపడిన సవర మళ్లిక

**మందస:** మండలంలోని సాబకోట గిరిజన పంచాయతీ బిత్తరబందలో దొంగలు హల్‌చల్ సృష్టించారు. బుధవారం రాత్రి కారు, రెండు ద్విచక్ర వాహనాలపై గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి సవర మల్లిక అనేక మహిళపై దాడి చేసి చెవికి ఉన్న బంగారపు రింగులను పట్టుకుపోయారు. ఈ సమయంలో ఆమె ప్రతిఘటించగా కత్తితో దాడికి పాల్పడ్డారు. బాధితురాలిని స్థానికులు గుర్తించి 108 అంబులెన్సులో హరిపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



లింగాలవలసలో పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

**టెక్కలి :** పట్టణ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం టెక్కలి వైఎస్సార్ జంక్షన్‌లో అన్న క్యాంటీన్ నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. అనంతరం లింగాలవలసలో గత వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మాణం చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టుమహ దేవి కోనేరు గట్టు అభివృద్ధిలో భాగంగా ట్యాక్సీ స్టాండును తక్షణమే తరలించాలని ఆదేశించారు. ట్యాక్సీ స్టాండు కోసం ప్రత్యామ్నాయంగా స్థలాన్ని కేటాయించామని, తక్షణమే ఆ ప్రదేశంలో వాహనా లు నిలుపుదల చేసుకోవాలని స్పష్టంగా చెశారు. ఈయనతో పాటు ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, నాయకు లు కె.హరివరప్రసాద్, కె.కిరణ్, బి.శేషు పాల్గొన్నారు.

### అటెండర్ అనుమానాస్పద మృతి!

**నరసన్నపేట:** స్థానిక మారుతీనగర్-1లో ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్న కొర్రాయి రమణమూర్తి (55) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు సమాచారం. ఈయన టెక్కలి వంశధార కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఒక్కరే ఇంట్లో ఉంటున్నారు. సోమవారం నుంచి ఆయన కనిపించడం లేదు. ఆయన వినియోగించే ద్విచక్ర వాహనం కూడా ఇంటి బయటే ఉంది. గురువారం సాయంత్రం ఇంటి లోపల నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఇంటి తలుపులు తీసేందుకు ప్రయత్నించగా లోపల గడియ పెట్టి ఉండటంతో వెనక్కి వచ్చేశారు. అనంతరం కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. రమణమూర్తి కుమార్తెకు వివాహం కాగా, కుమారు డు విశాఖలో ఒక ప్రవేటు కంపెనీలో పనిచేస్తున్నారు.

### బైపీసీ విద్యార్థులకు అవకాశం


**శ్రీకాకుళం రూరల్:** ఇంటర్మీడియెట్ బైపీసీ పూర్తి చేసిన విద్యార్థులకు పారామెడికల్ నర్సింగ్, బీపీటీ, ఎంఎల్‌టీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు రాగోలులోని బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 19లోగా దర ఖాస్తు చేసుకోవాలని కోరారు. కోర్సు పూర్తయ్యాక ఉద్యోగం కల్పించి ఫీజును జీతంలో మినహాయిస్తామన్నారు. పూర్తి వివరాలకు 9121999654, 76809 45357 నంబర్‌ను గానీ, రాగోలు జెమ్స్ ఆసుపత్రి లోని బొల్లినేని మెడిస్కిల్స్‌ను గానీ సంప్రదించవచ్చని పేర్కొన్నారు.



- ఏడాది పొడవునా జలకళ
- ఆరు నెలలు సాగునీరు.. ఆరు నెలలు ఉప్పునీరు
- లబ్ధి పొందుతున్న వ్యవసాయ, ఆక్వా రైతులు

# సు జలాం.. సు ఫలాం

## ముసళ్ల ఖానా @ 100



ముసళ్లఖానా గుండా ప్రవహిస్తున్న నీరు

**సంతబొమ్మాళి :**

బ్రిటీష్ కాలంలో నిర్మాణం జరుపుకుని వందేళ్ల చరిత్ర కలిగిన ముసళ్ల ఖానాకు ఓ ప్రత్యేకత ఉంది. మండువేసవిలో సైతం నిండుకుండలా ఉంటూ ఇటు వ్యవసాయ రైతులకు సాగునీరు, అటు ఆక్వా రైతులకు ఉప్పునీరు అందిస్తూ ఆసరాగా నిలుస్తోంది. నౌపడ నుంచి వెంకటాపురం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో సీతానగరం వద్ద ఉన్న ఈ ముసళ్లఖానాకు వందేళ్ల పైబడి చరిత్ర కలిగి ఉంది. ఒకప్పుడు ఈ ఖానాలో మొసళ్లు సంచరించేవని, అందుకే మొసళ్ల ఖానాగా పిలిచేవారని స్థానికులు చెబుతుంటారు. కాలక్రమేణా ఆ పేరు ముసళ్ల ఖానాగా మారిపోయిందని అంటుంటారు.

### నిత్యం జలకళ..



నిండుకుండలా ప్రవహిస్తున్న నీరు

ఈ ఖానా గుండా ఏడు కిలోమీటర్లు దూరం నీరు పయనిస్తూ భావనపాడు వద్ద సముద్రంలో కలుస్తుంటుంది. సంతబొమ్మాళితో పాటు టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, మెళియాపుట్టి, పాతపట్నం, వజ్రపుకొత్తూరు మండలాల నుంచి వచ్చే వరదనీరు ఈ ఖానా గుండా ప్రవహించి భావనపాడు సముద్రంలో కలుస్తుండటంతో నిత్యం కళకళలాడుతూ కనిపిస్తుంటుంది. జనవరి నుంచి జూన్ వరకు ఉప్పునీరు, జూలై నుంచి డిసెంబర్ వరకు సాగునీటి ప్రవాహం ఉంటుంది. సీతానగరం, సెలగపేట, ఉయ్యాలపేట, నాయుడుపేటకు చెందిన పలువురు ఆక్వారైతులు సుమారు 100 ఎకరాల్లో ఈ నీటిపైనే ఆధారపడి ఆక్వా సాగు చేస్తున్నారు. వర్షాకాలంలో జూలై నుంచి వరి సాగుకు ఈ నీటిని రైతులు ఉపయోగిస్తుంటారు. ఇంజిన్ల సహాయంతో సుదూర ప్రాంతాలకు సాగు నీటిని రైతులు తరలిస్తుంటారు. సుమారు 500 ఎకరాల వరకు సాగునీరు అందుతుంది. అంతేకాకుండా కార్తీక మాసంలో ఈ ఖానా వద్దే భక్తులు స్నానమాచరిస్తుంటారు. వినాయకుడు, సరస్వతి దేవి, దుర్గాదేవి విగ్రహాలను ఈ ఖానా వద్దే నిమజ్జనం చేస్తుంటారు. నిత్యం వందలాది సంఖ్యలో వాహనాలు ఈ ఖానాపైనే రాకపోకలుసాగిస్తుంటాయి. ఎంతో ప్రత్యేకత కలిగిన ఈ ఖానా శిథిలావస్థకు చేరుకోవడంతో రైతులు, పరిసర ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఉపయోగకరం..



ఈ ఖానా గుండా ప్రవహించే ఉప్పు నీరు ఆక్వా రైతులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. నిత్యం నీరు ఉండడంతో ఏదో విధంగా ప్రజల అవసరాలకు వినియోగిస్తున్నారు. వందేళ్ల పైబడి చరిత్ర కలిగిన ముసళ్ల ఖానాను పరిరక్షించాలి.

-బి.సుధాకర్, ఎంపీటీసీ, ఆక్వారైతు, సీతానగరం

### రైతులకు వరం



వ్యవసాయ రైతులు, ఆక్వా రైతులకు ముసళ్ల ఖానా ద్వారా ప్రవహించే నీరు వరంలా మారింది. సీజన్ బట్టి అందరికీ ఉపయోగపడుతుంటుంది. రోడ్డు విస్తరణ నేపథ్యంలో చరిత్ర కలిగిన ఈ ఖానా ఏ విధంగా రూపాంతరం చెందుతుందో చూడాల్సిందే.

- వాదరేవు కృష్ణారావు, రైతు, సీతానగరం

## ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

**గార:** ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. గురువారం అంపోలు జిల్లా జైలును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల్లో ఇప్పటి వరకు న్యాయవాది ఎవ్వరూ లేనివారికి ప్రభుత్వ న్యాయవాదులు నియమించే విషయంలో సహకరిస్తామన్నారు. బెయిల్ పిటీషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మహిళా బ్యారెక్‌కు వెళ్లి ముద్దాయిలతో మాట్లాడి కేసుల విషయమై వేర్వేరుగా తెలుసుకున్నారు. రానున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం లైబ్రరీ, వంటశాల, జైలు ఆవరణను పరిశీలించారు. ఆయనతో పాటు అడ్వకేట్ జి.ఇందిరాప్రసాద్, జైలర్ దివాకర్‌నాయుడు పాల్గొన్నారు.

### ఈవీఎం గోదాముల తనిఖీ



ఈవీఎం గోదాము తనిఖీ చేస్తున్న నోడల్ అధికారి విశ్వేశ్వరరావు

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎంల భద్రతా ఏర్పాట్లపై మాసాంతపు తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదామును రాష్ట్ర ఈవీఎం నోడల్ అధికారి కె.విశ్వేశ్వరరావు గురువారం పరిశీలించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచనల మేరకు ట్రిపుల్ లాక్ విధానం, 24 గంటల సీసీటీవీ పర్యవేక్షణ, భద్రతా వ్యవస్థలు, సిబ్బంది విధులు, హాజరును సమీక్షించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా హాజరై భద్రతా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ పట్ల నమ్మకం కలిగేందుకు ఇటువంటి తనిఖీలు అవసరమని వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఎన్నికల విభాగాధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సహకారంలో సమన్వయం అవసరం: కలెక్టర్

**శ్రీకాకుళం పాతబస్టాండ్:** సహకార రంగాన్ని బలోపేతం చేయాలంటే అన్ని శాఖల సమన్వయం అవసరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. గురువారం సాయంత్రం ఆయన జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా 12 విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్రం ప్రకటించిన సహకార నామ సంవత్సరం కార్యక్రమాల అమలుపై కార్యాచరణను రూపొందించాలనే ఉద్దేశంతో ఈ సమీక్ష జరిగింది. ప్రతి నెల ప్రత్యేక కార్యక్రమం ప్రజల భాగస్వామ్యంతో జిల్లాలో నెలనెలా సహకార రంగంపై అవగాహన కార్యక్రమాలు, శిక్షణలు, రికవరీ డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. పీఏసీఎస్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సహకార శ్రేణుల మధ్య అవగాహన పెంపుపై దృష్టి సారించాలన్నారు. రైతులకు, చిన్న వ్యాపారులకు, మహిళా సంఘాలకు అందే రుణ సౌకర్యాలు, డ్రాయింగ్ లిమిట్ల పెంపు, మద్దతు ధరలపై సమాచార ప్రచారం వంటి అంశాలపై శాఖల సమన్వయంతో కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి నగేష్, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీధర్ రాజా, వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాథ స్వామి, ఆహార, పౌర సరఫరాల శాఖ, పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖ, డీసీసీబీ మేనేజింగ్ డైరెక్టర్, నాబార్డ్ డీడీఎం, ఎఫ్‌సీఐ ప్రతినిధి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న బారువ ఎస్ఐ హరిబాబునాయుడు

**సోంపేట:** మండలంలోని బేసి రామచంద్రాపురం జాతీయ రహదారి వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన యువకుడు రుద్రొశెట్టి (23) మృతి చెందాడు. బారువ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన సోదరులు రుద్రొశెట్టి, బబ్లూ శెట్టి గుంటూరులో క్వారీ పని చేస్తున్నారు. స్వగ్రామంలో వివాహ వేడుకకు హాజరయ్యేందుకు గుంటూరు నుంచి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. బేసిరామచంద్రాపురం వద్దకు వచ్చేసరికి డివైడర్‌ను ఢీకొట్టి పడిపోయారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో రుద్రొశెట్టి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. బబ్లూశెట్టికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. బారువ ఎస్.ఐ హరిబాబునాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

### భారీగా బెల్లం ఊట ధ్వంసం



ఎగువబగడలో సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు



చాపరాయిగూడలో స్వాధీనం చేసుకున్న సామగ్రితో సీఐ కృష్ణారావు

**మెళియాపుట్టి/పాతపట్నం:** గిరిజన గ్రామాల్లో నాటు సారా స్థావరాలపై దాడులు ముమ్మరం చేస్తున్నట్లు టెక్కలి ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్ అన్నారు. గురువారం మెళియాపుట్టి మండలం ఎగువబగడ గ్రామంలో ఎక్సైజ్ సిబ్బంది సారా తయారీ స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించారు. 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 60 లీటర్ల సారా, తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో పలువురు సిబ్బంది ఉన్నారు. అదే విధంగా పాతపట్నం మండలం చాపరాయిగూడ పరిధిలో సారా బట్టీలపై దాడులు జరిపారు. 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.కృష్ణారావు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది సోమనాథం, వాసుదేవరావు, శివ పాల్గొన్నారు.

## ఒకేసారి మూడు ఉద్యోగాలు



యారబాటి మోహన్‌రావు

**సంతబొమ్మాళి:** మండలంలోని ఆర్.హెచ్.పురం గ్రామానికి చెందిన యారబాటి మోహన్‌రావు ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించాడు. ఇటీవల విడుదలైన బ్యాంకింగ్ ఫలితాలలో యూనియన్ బ్యాంక్ ఎల్‌బీవో (లోకల్ బ్యాంక్ ఆఫీసర్), సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో క్లర్క్, బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఎంపికై శభాష్ అనిపించాడు. మోహన్‌రావు చిన్నతనంలోనే తండ్రి కృష్ణారావు మరణించగా, తల్లి కాశమ్మ పెంపకంలో మేనమామ హేమసుందర్ సహకారంతో పట్టుదలతో ఉన్నత విద్య అభ్యసించాడు. ఇంజినీరింగ్ పూర్తయ్యాక పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాడు. తాజాగా ఒకేసారి మూడు కొలువులు సాధించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాను యూనియన్ బ్యాంక్ ఎల్‌బీవోగా జాయినింగ్ అవుతానని మోహన్‌రావు గురువారం 'సాక్షి'కి తెలిపారు.

## మానవత్వం చాటుకున్న ఏపీఓ

**ఇచ్ఛాపురం రూరల్:** సాటి మనిషి కష్టాల్లో ఉంటే ఎగతాళి చేసే ఈ రోజుల్లో రోడ్డు ప్రమాదానికి గురైన ఓ ఉద్యోగికి సపర్యలు చేసి మానవత్వాన్ని చాటుకున్నాడు మరో ఉద్యోగి. కంచిలి మండలం ఎం.ఎస్.పల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ దాసు అనే ఒరియా ఉపాధ్యాయుడు ఒడిశా పాటి సున్నాపురం ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్నారు. గురువారం విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఇన్నేశుపేట వద్ద ఎదురుగా బుల్లెట్ బండిపై వస్తున్న తులసిగాం యువకులు బలంగా ఢీ కొట్టారు. ఈ ఘటనలో ఉపాధ్యాయుడికి కాలు విరిగిపోవడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. అదే సమయంలో అటువైపుగా వస్తున్న ఉపాధి హామీ పథకం ఏపీఓ పెట్ల శ్రీనివాసరావు వెంటనే క్షతగాత్రుడ్ని తన ఒడిలోకి తీసుకొని సపర్యలు చేశారు. అటువైపుగా వెళ్తున్న ఉపాధి కూలీల సహాయంతో ఎండ తగలకుండా చీరను పరదాగా చేసి 108 అంబులెన్సుకు సమాచారం అందించి ఇచ్ఛాపురం ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఈ.శ్రీనివాస్ తెలిపారు.



లక్ష్మీనారాయణదాసుకు సపర్యలు చేస్తున్న ఏపీఓ శ్రీనివాసరావు

### త్రీస్టాప్.. నో స్టార్ట్



టెక్కలి ఆర్టీసీ డిపోకు చెందిన విశాఖపట్నం 3-స్టాప్ బస్సు గురువారం కాంప్లెక్స్ ఆవరణలో మొరాయించింది. ఎంతకీ స్టార్ట్ కాకపోవడంతో స్థానికులు ముందుకు నెట్టారు. అయినా ఫలితం లేకపోవడంతో ప్రయాణికులను మరో బస్సులో ఎక్కించి పంపించారు. - టెక్కలి రూరల్

### అగ్ని ప్రమాదాలు ఆపేద్దాం



పాఠశాలల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఎటువంటి నియంత్రణ చర్యలు తీసుకోవాలి అనే అంశంపై శుక్రవారం టెక్కలి, కోటబొమ్మాళిలోని పలు పాఠశాలల్లో అగ్ని మాపక సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రకాల అగ్ని ప్రమాద నియంత్రణ పరికరాలతో మంటలను ఆర్పుతూ పిల్లల్లో చైతన్యం తీసుకొచ్చారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - టెక్కలి

## హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ సంఘ నాయకులు రమణ

**శ్రీకాకుళం:** ప్రభుత్వం ఏర్పాటు చేయదలచిన 7,500 మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎం) పోస్టులను మంజూరు చేసి ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ శాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ ప్రభుత్వాన్ని కోరారు. శ్రీకాకుళం పట్టణంలోని ఎన్ఆర్ దాసరి క్రాంతి భవన్‌లో గురువారం ఎస్టీయూ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్న ఆదర్శ పాఠశాలలో ఒక సీనియర్ ప్రధానోపాధ్యాయుడు ఉండటం వల్ల పిల్లలకు నాణ్యమైన బోధన అందుతుందని తెలిపారు. రాష్ట్రంలో 117 జీఓ రద్దుతో కూడిన సవరణలు అమలు చేస్తున్న సందర్భంలో కూడా అన్ని చోట్ల 3, 4 తరగతులు ఉన్నత పాఠశాల నుంచి ప్రైమరీ పాఠశాలలకు తీసుకురాకుండా స్కూల్ అసిస్టెంట్లతో కొన్నాళ్ల పాటు బోధన చేయించాలనే ఆలోచన చేస్తున్నారని అన్నారు. ఇలాంటి పాఠశాలలు 900 వరకు ఉన్నాయని వీటిలో 1, 2 తరగతులకు కూడా ప్రవేశం కల్పిస్తామని ఇటీవలి ఉన్నత అధికారులు వెల్లడించారని గుర్తు చేశారు. దీనిపై సరైన నిర్ణయాలు, నిబంధనలు ప్రకటించాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, చింతల రామారావు, కూన శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, ఎన్.లక్ష్మణరావు, ఎం.మురళీధర్, చౌదరి జగన్, ఎం.తేజ, జి.తిరుమలరావు, డీవీఎన్ పట్నాయక్ పలు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఉపాధి బిల్లులు చెల్లించేదెన్నడు?



మాట్లాడుతున్న గంగరాపు సింహాచలం

**శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):** పన్నెండు వారాలుగా ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వకపోతే ఎలా జీవనం సాగిస్తారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ జనవరి 15 నుంచి నేటి వరకు ఉపాధి వేతనదారులు ఎండనక వాననక పనిచేస్తున్నా నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు జీతభత్యాలు లక్షలు రూపాయలు పెంచుకుంటున్నారే తప్పా ఉపాధి కూలీల బాధలు పట్టడం లేదన్నారు. పేదల ఓట్లతో అందలమెక్కుతున్న పెద్దలు ఉపాధి కూలీల పట్ల మర్యాదగా వ్యవహరించాలని, లేకుంటే ప్రజాగ్రహానికి గురవ్వక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు శిర్ల ప్రసాద్, కె.ఎల్లయ్య, భవాని పాల్గొన్నారు.